సాక్షి చిత్తూరు

ఆదివారం : 23 : మార్చి : 2025



పిల్లల ప్రవర్తనపై నిఘా ఉంచండి

తల్లిదండ్రులు పిల్లల ప్రవర్తనలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ పేర్కొన్నారు.

- 8లో



1.5 కోట్ల ఫ్రూట్ కవర్ల విక్రయం

జిల్లా వ్యాప్తంగా 1.5 కోట్ల మ్యాంగో ఫ్రూట్ కవర్లు విక్రయించినట్లు ఉద్యానవన శాఖాధికారి వెల్లడించారు.

- 8లో



రంజాన్ వేళలు

	ఇఫ్తార్ ఆదివారం (సా)	సహర్ సోమవారం (ఉ)
చిత్తూరు	6-29	4-55
పుంగనూరు	6-31	4-59

న్యూస్‌రీల్

27న షబ్-ఏ-ఖదర్

చిత్తూరు రూరల్ : ముస్లింలు షబ్ ఏ ఖదర్ పండుగను ఈనెల 27వ తేదీన జరుపుకోవాలని జిల్లా ప్రభుత్వ ఖాజీ జనాబ్ మోల్వి సయ్యద్ షా మహమ్మద్ కమాలుల్లా జుహూరీ లతీఫ్ జునైది ఒక ప్రకటనలో తెలిపారు. పండుగ రాత్రి అత్యంత భక్తిశ్రద్ధలతో జాగారం, నమాజు చేసి విశ్వ శాంతికి అల్లా వద్ద దువా చేయాలన్నారు.

నెల రోజుల్లో ఎలిఫెంట్ బేస్ క్యాంపు

- త్వరలో శిక్షణ పొందిన కుంకీ ఏనుగులు రాక
- పనులను పరిశీలించిన ఉన్నతాధికారులు



ఎలిఫెంట్ బేస్‌క్యాంపు పనులను పరిశీలిస్తున్న సీఎఫ్, డీఎఫ్‌వో

పలమనేరు : మరో నెల రోజుల్లో ముసలిమొడుగు వద్ద నిర్మిస్తున్న ఎలిఫెంట్ బేస్‌క్యాంపు పనులు పూర్తికానున్నాయని కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ యశోధ పేర్కొన్నారు. ఆ మేరకు మండలంలోని కాలువపల్లి వద్ద సాగుతున్న ఎలిఫెంట్ క్యాంపు పనులను శనివారం ఆమె పరిశీలించారు. ఇందులో డీఎఫ్ భరణి, సబ్ డీఎఫ్‌వో వేణుగోపాల్ స్థానిక అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఇక్కడ సాగుతున్న అన్ని రకాల పనులు 80శాతం పూర్తయ్యాయని తెలిపారు. కర్ణాటక రాష్ట్రంలోని మైసూరు నుంచి శిక్షణ పొందిన నాలుగు ఏనుగులను ఇక్కడికి రప్పించనున్నట్లు తెలిపారు. బేస్ క్యాంపు చుట్టూ ఎలిఫెంట్ ప్రూఫ్ ట్రెంచిలు, హ్యాగింగ్ సోలార్ ఫెన్సింగ్‌ను ఏర్పాటు చేశామన్నారు. కౌండిన్యలోని మదపు టేనుగుల బారీ నుంచి కుంకీ ఏనుగుల ద్వారా మళ్లించడం జరుగుతుందన్నారు. ఇక్కడి ప్రజల సందర్శనార్థం సుందరీకరణ పనులు చేపడుతున్నట్లు తెలిపారు.

భయపడే ప్రసక్తే లేదు



క్షతగాత్రులను పరామర్శిస్తున్న మాజీ డిప్యూటీ సీఎం నారాయణస్వామి

చిత్తూరు రూరల్ (కాణిపాకం): ఎవరికీ భయపడే ప్రసక్తే లేదని, దాక్కోవాల్సిన గతి పట్టలేదని మాజీ డిప్యూటీ సీఎం నారాయణస్వామి తెలిపారు. శనివారం చిత్తూరు జిల్లా ఆస్పత్రిలో ఆయన మీడియాతో మాట్లాడారు. విదేశాల్లో నివసిస్తున్న కుమార్తె వద్దకు వెళితే తప్పుడు ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. తాను ఎలాంటి తప్పు చేయలేదని స్పష్టం చేశారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో 145 గ్రామాల్లోని ఆలయాలను రూ.10లక్షల చొప్పున వెచ్చించి అభివృద్ధి చేశామన్నారు. జీడీనెల్లూరు నియోజకవర్గంలో రోడ్లు వేశామని, తాగునీటి ట్యాంకులు నిర్మించామని, అవినీతికి తావు లేకుండా గ్రామీణాభివృద్ధికి కృషి చేశామని వివరించారు. కుమార్తె దగ్గరకు వెళితే భయపడి వెళ్లిపోయారని చెప్పడం కరెక్టు కాదన్నారు. అలాగైతే విదేశాలకు వెళ్లేవారంతా భయపడి వెళుతున్నారా అంటూ ప్రశ్నించారు. అసత్య ప్రచారాలను వదలిపెట్టి, ప్రజాసేవపై దృష్టి పెట్టాలని సూచించారు. కూటమి ప్రభుత్వం ఇచ్చిన వాగ్దానాలను నెరవేర్చాలని డిమాండ్ చేశారు. అసలు పనులను పక్కనపెట్టి కేసులతో వేధించడమే పనిగా పెట్టుకున్నారని విమర్శించారు.

క్షతగాత్రులకు పరామర్శ

శ్రీరంగరాజపురం మండలం పొదలపల్లె వద్ద ట్రాక్టర్ బోల్తా ఘటనలో గాయపడిన వారిని చిత్తూరు ప్రభుత్వ ఆస్పత్రిలో మాజీ డిప్యూటీ సీఎం నారాయణస్వామి పరామర్శించారు.బాధితులకు ఆర్థిక సహాయం అందించారు. క్షతగాత్రులకు మెరుగైన చికిత్స అందించాలని వైద్యులను కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు గురవారెడ్డి, ఎస్‌ఆర్‌పురం మండల అధ్యక్షుడు మణి, నేతలు సామి, వెంకటేష్‌రెడ్డి పాల్గొన్నారు.

SUNDAY SPECIAL

డ్యూయెట్.. వెడ్డింగ్ షూట్!



ఫొటో షూట్‌ల సందడి ఇటీవల బాగా ఎక్కువైంది.. ఏ శుభకార్యం జరిగినా స్పెషల్ ఫొటో షూట్ ఉండాల్సిందే.. ఇక పెళ్లిళ్ల విషయానికొస్తే ప్రీ వెడ్డింగ్.. పోస్ట్ వెడ్డింగ్.. సాంగ్ షూటింగ్ అంటూ హంగామా చేస్తున్నారు. ఇప్పుడు ఓ మంచి లోకేషన్‌లో చిన్నపాటి సినిమాను తలపించేలా.. సెట్టింగ్‌లు.. యాక్షన్.. అంటూ టేకులు తీసుకుంటూ కొత్త జంటలు మురిసిపోతున్నాయి. ఇందులో పాటలు.. అదిరిపోయే సీన్‌లు.. వెరైటీ ఫోజుల్లో నూతన జంటలు కొత్త లుక్స్‌తో కనిపిస్తున్నాయి. ఈ నయా ట్రెండ్ జిల్లాకు పాకింది. పెళ్లికి అయ్యే ఖర్చులను మించిపోతున్నా ఎవరూ తగ్గదేలేదంటూ కొత్త జంటలు ప్రీ వెడ్డింగ్, పోస్ట్ వెడ్డింగ్ షూట్‌లను బాగా లైక్ చేస్తున్నారు.

- జిల్లాలో పెరిగిన ప్రీ వెడ్డింగ్ షూట్లు
- సినిమాను తలపించేలా చిత్రీకరణ
- ప్రత్యేక స్థలాలు, బీచ్‌లు ఎంపిక
- షూటింగ్‌కు రూ.లక్షల్లో వ్యయం
- ప్యాకేజీల పేరుతో ఆఫర్లు
- అధిక ప్రాధాన్యం ఇస్తున్న కొత్త జంటలు

కాణిపాకం : పెళ్లి.. జీవితాంతం గుర్తుండిపోయే మధుర వేడుక. ఆ సంబరాలకు సంబంధించిన జ్ఞాపకాలు భద్రంగా ఉండాలి కదా! అందుకో మార్గం ఉంది.. ఫొటో, వీడియో షూట్. అయితే.. ఈ మధ్య ఫొటో, వీడియో షూట్‌ల ట్రెండ్ మారింది. పెళ్లికి ముందు ప్రీ వెడ్డింగ్ షూట్, కపుల్ షూట్ తప్పనిసరి అయిపోయాయి. సినిమాను తలపించే లైటింగ్, ఎఫెక్ట్స్, సెట్టింగులతో ఫొటో, వీడియో షూట్లు నిర్వహిస్తున్నారు. చేయి తిరిగిన ఫొటోగ్రాఫర్, అత్యాధునిక కెమెరా, స్వర్గాన్ని తలపించే లొకేషన్స్ ఎంపిక చేసుకుని ప్రీ వెడ్డింగ్‌లో కిసిక్..కిసిక్‌కుగా కొత్తజంటలు మైమరిచిపోతున్నాయి. పెళ్లంటే పందిళ్లు....సందళ్లు తప్పెట్లు..తాళాలు తలంబ్రాలూ మూడుముళ్లు..ఏడడుగులు ఇదీ అందరికీ తెలిసిందే. కానీ ప్రస్తుతం వీటి తో పాటు పెళ్లి వేడుకలు కొత్త పుంతలు తొక్కుతున్నాయి. పెళ్లి సంబరాలు చెదరని మధుర జ్ఞాపకంలా జీవితాంతం గుర్తుండి పోయేలా యువతీ యు వకులు పెళ్లికి సిద్ధం అవుతున్నారు. ఇందులో భాగంగా ప్రీవెడ్డింగ్ షూట్‌లకు ప్రాధాన్యం ఇస్తున్నారు. జిల్లాలో ఈ ప్రీ



వెడ్డింగ్ షూట్ ట్రెండ్‌గా మా రింది. కొత్తగా పెళ్లి ఫిక్స్ అయితే ముందుగా ప్రీ వెడ్డింగ్ ఫొటో, వీడియో షూట్‌కు రెడీ అవుతున్నారు.

అదిరేలా...

గతంలో పెళ్లయ్యాక హనీ మూన్‌కు ఎక్కడికెళ్లాలి అంటూ అందరితో ఆరా తీసేవారు. ఇప్పుడు నిశ్చితార్థం కాకముందే ప్రీవెడ్డింగ్ ఫొటో, వీడియో షూట్‌కు సిద్ధమవుతున్నారు. అందమైన ప్రదేశంలో ఫొటో, వీడియో షూట్లు తీసే లా ముందస్తుగా ప్లాన్ చేసుకుంటున్నారు. వివాహానికి ముందే వధూవరులు తమ హావభావాలు, సంభాషణలు, సాన్నిహిత్యాన్ని చిత్రీకరించుకుంటున్నారు. భిన్న కోణాల్లో చూసు కుని మురిసిపోయేందుకు.. రేపటి తరానికి చూపించేందుకు ఎంత వ్యయమైనా వెచ్చించేందుకు వెనుకాడడం లేదు.

ప్యాకేజీలతో...

గతంలో పెళ్లికి ఫొటోలు, వీడియో తీయించుకోవాలంటే తెలిసిన ఫొటోగ్రాఫర్లకు చెప్పుకునేవాళ్లు. కానీ ఇప్పుడా పరిస్థితి పూర్తిగా మారిపోయింది. కేవలం ప్రీ వెడ్డింగ్ షూట్ కాకుండా ఆల్బమ్, వీడియోలు అన్ని కలిపి ప్యాకేజీగా తీసుకుంటున్నారు. దీనికి రూ.లక్ష నుంచి రూ.10 లక్షల వరకు పలు రకాల ప్యాకేజీలున్నాయి. ఇందులో ప్రీ వెడ్డింగ్ షూట్, పోస్ట్ వెడ్డింగ్ షూట్స్ ఉంటాయి. వివాహానికి కొద్ది రోజుల ముందు, వివాహమైన తర్వాత రెండు రోజుల పాటు ప్రత్యేకంగా షూటింగ్ చేసి వీడియోలను చిత్రీకరిస్తున్నారు. పెళ్లి సీజన్‌లకు అనుగుణంగా ఫొటో, వీడియో గ్రాఫర్లు ప్యాకేజీలు ప్రకటిస్తున్నారు.



సాంకేతికతతో.. అద్భుతంగా చిత్రీకరణ

'ప్రీ వెడ్డింగ్ షూట్' ద్వారా ఆధునిక కెమెరాలతో ఓ సినిమా పాటలా చిత్రీకరిస్తున్నారు. దీంతో పాటు జీవితాంతం గుర్తుండిపోయేలా ఫొటోకు అదిరిపోయేలా ఫోజులిస్తున్నారు. ప్రీ వెడ్డింగ్ షూట్‌ను చిత్రీకరించేందుకు హైడెన్సిటీ (హెచ్‌ఏ) టెక్నాలజీని ఉపయోగిస్తున్నారు. మంచి క్వాలిటీ ఉన్న కెమెరాలను ఉపయోగిస్తున్నారు. ఒక షూట్ చేయడానికి కనీసం నలుగురు కెమెరామెన్లు పనిచేస్తున్నారు. డ్రోన్ కెమెరాలను వినియోగిస్తున్నారు. మూడు నుంచి 4 నిమిషాల నిడివిగల పాటకు సుమారు 2 నుంచి 3 రోజుల పాటు పనిచేస్తారు. ఒక పాటకు ఒక్కోసారి ప్రదేశాలను మార్చాల్సి ఉంటుంది. ప్రదేశం మారిన సమయంలో దుస్తులను మార్చుకోవడం, మేకప్ వంటి వాటికి ప్రాధాన్యం ఇవ్వడంతో సమయం ఎక్కువ పడుతుంది. చిత్రీకరణను పాట రూపంలో తీసుకొచ్చేందుకు ఎంతో శ్రమించాల్సి ఉంటోంది. ఎడిటింగ్‌కు కనీసం 10 రోజుల సమయం పడుతుంది.

మీమ్స్ నయా ట్రెండ్

నూతన దంపతులు దిగిన ఫొటోలు, వీడియోలను మీమ్స్ మార్చి వాటిని పెళ్లిలోనే ప్రదర్శించి నవ్వులు పూయిస్తున్నారు. ఎల్‌ఈడీ తెరను ఏర్పాటు చేసుకుని కుటుంబ సభ్యులు, బంధువులు కలిసి వీక్షిస్తున్నారు. ఈ క్షణాలనూ వీడియో తీసుకుంటున్నారు. ప్రీవెడ్డింగ్ వీడియోలను సామాజిక మాధ్యమాల్లో రీల్స్ పెట్టడానికి ఎక్కువ జంటలు ఆసక్తి చూపిస్తున్నాయి. అలాగే కుటుంబంలో చనిపోయిన కుటుంబీకులను కూడా బతికి ఉన్నట్లుగా చూపిస్తున్నారు. వధూవరులను ఆశీర్వదించేలా, కుటుంబీకులతో కలిసి ఫొటోలు దిగేలా తెర మీద చూసుకుంటున్నారు. ఇలాంటి వాటికి ఇప్పుడు మరింత క్రేజ్ ఏర్పడింది.

ఈ ప్రాంతాల్లోనే...

జిల్లాలోని రిసార్ట్‌లు, పెద్ద హోటల్ ప్రాంతాలు, రద్దీగా లేని జాతీయ రహదారులు, తమిళనాడులోని వేలూరు, చెన్నై బీచ్, సినిమా స్పాట్లు, పాండిచ్చేరిలోని బీచ్, సినిమా చిత్రీకరించిన ప్రదేశాల్లో ఫొటో, వీడియో షూట్‌కు ఇష్టపడుతున్నారు. కర్ణాటకలోని జారువాలే జలపాతాలు, పొగ మంచుతో కమ్ముకునే ఉండే ప్రాంతాలను ఎంచుకుంటున్నారు. పల్లె ప్రాంతాల్లో పచ్చని పంట పొలాలు, కొబ్బరి తోటల గట్ల మీద, చెరువులు, పచ్చదనం పరుచుకున్న కొండ ప్రాంతాలను ఎంపిక చేసుకుంటున్నారు.

ప్రీ వెడ్డింగ్‌తో పనులొచ్చాయి



ముందు అయితే పెళ్లి సీజన్‌లో మాత్రమే గిరాకీలుండేవి. ప్రస్తుతం నడుస్తున్న నయా ట్రెండ్ వల్ల కాస్త చేతికి కావాల్సినంత పని దొరికింది. ప్రీ వెడ్డింగ్ షూట్ల వల్ల పెళ్లికి ఫొటో గ్రాఫర్లు, వీడియో గ్రాఫర్లు పెళ్లికి ముందే గిరాకీలు వస్తున్నాయి. మంచి నైపుణ్యం ఉన్న వారికి భలే డిమాండ్ ఉంది. అత్యాధునిక కెమెరాలనే షూట్‌కు వినియోగిస్తున్నాం.

– కృష్ణంరాజు, ఫొటోగ్రాఫర్, చిత్తూరు

చోరీ సొమ్ముతో ఖాకీల సోకు!





సాక్షి ఎఫెక్ట్..

- సహకరించిన పోలీసులకు యూనిఫామ్‌కు వెచ్చించిన వైనం
- దొంగ సొమ్ములు బయటపడకుండా పోలీస్ స్టేషన్‌కు రంగులు?
- రూ.12.50 లక్షల్లో కొద్ది ఖర్చులు.. ఆపై మొత్తం స్వాహా
- 'పోలీసు దొంగల' కేసులో యంత్రాంగం నివేదిక సిద్ధం?
- నలుగురిపై వేటు..? క్రిమినల్ కేసు నమోదుపై ఆరా

చిత్తూరు అర్బన్ : దొంగ నుంచి రికవరీ చేసిన సొమ్మును బాధితులకు అప్పగించకుండా వాటాలు వేసేసుకున్నారు. పంచుకున్న వాటాల డబ్బుల్లో ఏకంగా సిబ్బందికి యూనిఫామ్ పంపిణీ చేశారా..? స్టేషన్‌కు రంగులు వేయించారా..? అనే ప్రశ్నలకు అవుననే సమాధానాలు వినిపిస్తున్నాయి. చిత్తూరు జిల్లా పోలీసుశాఖలో ఓ దొంగను పట్టుకున్న పోలీసులు అతడి నుంచి రూ.12.50 కొట్టేయడం, ఈ విషయాన్ని రాయచోటి పోలీసులకు పట్టుబడ్డ దొంగ బహిర్గతం చేయడం తెలిసిందే. అక్కడి నుంచి సమాచారం చిత్తూరు పోలీసుశాఖకు చేరడంతో ఉన్నతాధికారులు విచారణ చేపట్టారు. దీనిపై ఇటీవల 'సాక్షి'లో 'పోలీసు దొంగలు..?' శీర్షికన కథనం ప్రచురితం అయింది. ఈ ఘటనపై విచారణ జరుపుతున్నట్లు ఎస్పీ మణికంఠ ఇప్పటికే స్పష్టం చేశారు.

ప్రాథమిక విచారణ పూర్తి

జిల్లా పోలీసుశాఖలో సంచలనం సృష్టించిన ఈ ఘటనలో ప్రాథమిక విచారణ పూర్తి చేసి నివేదిక సిద్ధం చేసినట్లు తెలిసింది. విశ్వసనీయ సమాచారం మేరకు.. దొంగ నుంచి లంచంగా తీసుకున్న రూ.12.50 లక్షల్లో.. ఓ పోలీసు రూ.3.50 లక్షలు, మరో పోలీసు రూ.9 లక్షలు తీసుకున్నట్లు సమాచారం. అయితే దొంగను పట్టుకోవడంలోని బృందంలో ఉన్న కానిస్టేబుల్ పెద్ద మొత్తంలో నగదును తన సమీప బంధువుల బ్యాంకు ఖాతాలకు మళ్లించి, ఆపై దీన్ని తన అధికారికి ఇచ్చినట్లు విచారణలో ఒప్పుకున్నట్లు తెలిసింది. ఇదే సమయంలో దొంగ సొమ్ముతో స్టేషన్‌లో పని చేసే పోలీసులకు ఖాకీ యూనిఫామ్ పంపిణీ చేయడంతో పాటు స్టేషన్‌కు రంగులు వేయించారనే ఆరోపణ విచారణలో బయటపడినట్లు సమాచారం. చట్టాన్ని అమలు చేయాల్సిన పోలీసులు, లంచంగా తీసుకున్న డబ్బును వ్యక్తిగత అవసరాలను వాడుకోవడంతో పాటు నీతి, నిజాయితీ, క్రమశిక్షణకు మారుపేరైన పోలీసుశాఖలోని సిబ్బందికి యూనిఫామ్‌ను కొనుగోలు చేసి ఇవ్వడం ఆశ్చర్యానికి గురిచేస్తోంది.

కేసు నమోదుపై చర్చ

విచారణ అధికారులు పూర్తి చేసిన ప్రాథమిక నివేదికపై ఓ పోలీసు ఉన్నతాధికారి, జిల్లా అధికారితో చర్చించినట్లు తెలుస్తోంది. 'దొంగ ఇచ్చిన రూ.12.50 లక్షలు ఎన్ని కేసుల్లో చోరీ చేశాడో, అన్ని కేసుల్లోనూ అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న పోలీసులను నిందితులుగా ఎందుకు చేర్చకూడదు..? అప్పగించిన పనిని పూర్తి చేయడంలో నమ్మక ద్రోహం చేసి, పోలీసుశాఖ పరువు తీసిన వీళ్లపై భారతీయ న్యాయ సంహిత (బీఎన్‌ఎస్) సెక్షన్ 316(5) కింద కేసు నమోదు చేయొచ్చా..?' అని సుదీర్ఘంగా చర్చించారనే సమాచారం గుప్పుమంటోంది. ఇక రూ.3.50 లక్షలు స్వయంగా తీసుకున్న పోలీసును సస్పెండ్ చేయడంతో పాటు, మరో పోలీసును సస్పెండ్ చేయడం లేదా వీఆర్‌కు పంపాలని.. ఇద్దరు కానిస్టేబుళ్లను సైతం విధుల నుంచి తొలగించాలని నిర్ణయించినట్లు సమాచారం. పనితీరు నచ్చి, తాను కాస్త చనువుగా ఉన్నంత మాత్రాన.. తప్పు చేసిన వాళ్లను కాపాడే ప్రసక్తేలేదని, ఈ ఘటనపై చట్టం ప్రకారం ముందుకు వెళ్లడం తప్ప మరో ఆలోచనలేదని పోలీసు 'బాస్' సైతం ఒకరిద్దరితో స్పష్టం చేసినట్లు తెలిసింది. ఏది ఏమైనా దొంగలను పట్టుకోవడంలో ప్రతిభ చూపిస్తే అవార్డులు, రివార్డులు పంపిణీ చేసే అధికారులు.. తప్పు చేసినపుడు చర్యలు తీసుకుంటే తప్ప సామాన్యులకు పోలీసు శాఖపై నమ్మకం ఉండదనేది బహిరంగ వాదన. ఈ ఘటన ఇంకా ఎన్ని మలుపులు తిరుగుతుందో వేచి చూడాలి.

ఆర్థిక అక్షరాస్యతకు కృషి



మాట్లాడుతున్న డీఆర్‌డీఏ పీడీ శ్రీదేవి

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లాలోని స్వయం సహాయక సంఘాల్లోని మహిళలకు అక్షరాస్యత ఎంతో ముఖ్యమని డీఆర్‌డీఏ పీడీ శ్రీదేవి అన్నారు. ఈ మేరకు శనివారం కలెక్టరేట్‌లోని డీఆర్‌డీఏ సమావేశ మందిరంలో స్వయం సహాయక సంఘాల సభ్యులకు ఆర్థిక అక్షరాస్యతపై కమ్యూనిటీ రిసోర్స్‌పర్సన్‌లకు శిక్షణ నిర్వహించారు. డీఆర్‌డీఏ పీడీ మాట్లాడుతూ స్వయం సంఘాల సభ్యులు ఆర్థిక అక్షరాస్యత సాధించడానికి కృషి చేయాలన్నారు. సంఘం, అందులోని సభ్యులకు ఆర్థిక ప్రణాళిక పొదుపు, ఆవశ్యకత, ఖర్చులు చేసే అంశాలకు అవగాహన ముఖ్యమన్నారు. రుణాలు పొందడం, డిజిటల్ లావాదేవీలు, సామాజిక భద్రత ఇన్సూరెన్స్‌పై అవగాహన పెంచుకోవాలన్నారు. గ్రామీణ ప్రాంతాల్లోని మైక్రో ఫైనాన్స్ సంస్థలను నియంత్రించి సంఘం సభ్యులకు రక్షణ కల్పించాలని ఆదేశించారు. సమావేశంలో లీడ్ బ్యాంక్ మేనేజర్ హరీష్, కమ్యూనిటీ రిసోర్స్ పర్సన్‌లు పాల్గొన్నారు.

12 మంది ఎస్‌ఐల బదిలీ

చిత్తూరు అర్బన్: జిల్లాలో 12 మంది ఎస్‌ఐలను బదిలీ చేస్తూ ఎస్పీ మణికంఠ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. వేకెంట్ రిజర్వులో (వీఆర్) ఉన్న కొందరికి స్టేషన్లు కేటాయించారు. దాదాపు ఏడు నెలలకు పైగా ఖాళీగా ఉన్న పెనుమూరు స్టేషన్‌కు సైతం ఎస్‌ఐను నియమించారు. స్థానచలనం పొందిన ఎస్‌ఐల వివరాలు... వీఆర్‌లో ఉన్న ఇ.ఎర్రిస్వామిని చిత్తూరు వన్‌టౌన్, పి.వెంకటరమణ– చిత్తూరు టూటౌన్, బి.తులసన్న– చిత్తూరు సీసీఎస్, జి.రామచంద్రయ్య– పెనుమూరు, పి.విజయ్‌నాయక్– నగరి, ఎ.వెంకటనారాయణ– ఎస్‌ఆర్.పేట, కె.రంగ– విజయపురం, కె.వెంకటరమణ –పుంగనూరు, ఎస్.ధనంజయరెడ్డి –పంజాణి, చిత్తూరు టూటౌన్‌లో ఉన్న ప్రసాద్‌ను బంగారుపాళ్యం, పంజాణిలో ఉన్న బి.శ్రీదేవిని చిత్తూరు పోలీస్ కంట్రోల్ రూమ్, విజయపురంలో ఉన్న కె.బలరామయ్యను చిత్తూరు పోలీసు శిక్షణ కేంద్రానికి బదిలీ చేశారు. ఈ క్రమంలోనే ఎస్‌ఆర్.పేటలో ఉన్న వెంకటసుబ్బమ్మ ఏపీ ట్రాన్స్‌కోకు బదిలీపై వెళ్లారు.

తెలుగు సాహిత్యానికి పోతన దిక్సూచి

- భాగవతంలోని బ్రహ్మ సూత్రాలను తెలుసుకోవాలి
- జాతీయ సదస్సులో యోగి వేమన విశ్వవిద్యాలయ ఆచార్యులు వెల్లడి



జాతీయ సదస్సులో మాట్లాడుతున్న వైవీయూ ఆచార్యులు ఈశ్వర్‌రెడ్డి

పలమనేరు : నేను, నీవు అనే భేదాలను విడిస్తే జీవితం ఉన్నతంగా ఉంటుందని భాగవతం ద్వారా మానవాళికి సూచించిన మహోన్నతుడు పోతన అని యోగి వేమన విశ్వ విద్యాలయం తెలుగు విభాగం ఆచార్యులు ఈశ్వర్‌రెడ్డి పేర్కొన్నారు. పలమనేరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో భాగవతం–భక్తి, తాత్వికత, సామాజికత అనే అంశంపై జాతీయ సదస్సు శనివారం ముగిసింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలుగు సాహిత్యానికి జీవం పోసిన పోతన మన తెలుగు గడ్డపై పుట్టడం మన అదృష్టమన్నారు. ముఖ్యంగా భాగవతంలోని 555 బ్రహ్మ సూత్రాలను మనం తెలుసుకోవాలని సూచించారు. మానవ జన్మకు అర్థం, పరమార్థం తెలుసుకోవాలంటే కచ్చితంగా భాగవతాన్ని చదవాలన్నారు. అనంతరం స్థానిక కళాశాల ప్రిన్సిపల్ వెంకటేశులు మాట్లాడుతూ.. ప్రతిఫలం ఆశించకుండా చేసే యజ్ఞ యాగాదుల గురించి భాగవతంలో విపులంగా వివరించారన్నారు. సదస్సు సంచాలకులు వాసు మాట్లాడుతూ.. దేశంలో ఇప్పటికీ ఇతిహాసాలను చదవని వారెందరో ఉన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో పలు విశ్వవిద్యాలయాల నుంచి వచ్చిన ఆచార్యులు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

28న వరసిద్ధుని హుండీ లెక్కింపు

కాణిపాకం: కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయకస్వామి ఆలయ హుండీని ఈ నెల 28వ తేదీన లెక్కించనున్నట్లు ఈఓ పెంచల కిషోర్ శనివారం తెలిపారు. ఆలయ ఆస్థాన మండపంలో ఉదయం 7 గంటలకు లెక్కింపు ప్రారంభమవుతుందన్నారు. అధికారులు, సిబ్బంది విధిగా హాజరు కావాలని ఆదేశించారు.

బంగారు నగలు చోరీ

చిత్తూరు అర్బన్ : నగరంలోని ఓ ఇంట్లో బంగారు నగలు చోరీపై శనివారం కేసు నమోదు చేసినట్లు తాలూకా ఎస్‌ఐ మల్లికార్జున తెలిపారు. చిత్తూరు నగరం మాపాక్షికి చెందిన మధుసూదన్‌రెడ్డి ఇంట్లో 125 గ్రాముల బంగారు ఆభరణాలు చోరీకి గురయ్యాయన్నారు. ఇంట్లో పనిచేసే వ్యక్తులే చోరీ చేసినట్లు అనుమానం వ్యక్తం చేస్తూ బాధితుడు ఫిర్యాదు చేశారన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ పేర్కొన్నారు.



ఉమ్మడి చిత్తూరు జిల్లా న్యాయమూర్తులతో హైకోర్టు జడ్జి

న్యాయమూర్తులతో సమీక్ష

- చిత్తూరులో హైకోర్టు న్యాయమూర్తి

చిత్తూరు అర్బన్ : రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి, జిల్లా పోర్ట్‌ఫోలియో (పరిపాలనా) జడ్జి జస్టిస్ కె.సురేష్‌రెడ్డి శనివారం చిత్తూరుకు వచ్చారు. ఉమ్మడి జిల్లాలోని న్యాయమూర్తులతో సమీక్షా సమావేశం నిర్వహించిన ఆయన పలు విషయాలపై చర్చించారు. అనంతరం ఉమ్మడి జిల్లాలోని న్యాయమూర్తులతో గ్రూప్ ఫొటో దిగారు. కాగా హైకోర్టు న్యాయమూర్తికి జిల్లా జడ్జి భీమారావుతో పాటు కలెక్టర్ సుమిత్‌కుమార్ స్వాగతం పలికి పుష్పగుచ్ఛం అందజేశారు.



హైకోర్టు న్యాయమూర్తిని కలిసిన కలెక్టర్

క్లుప్తంగా

హైకోర్టు జడ్జిని కలిసిన న్యాయశాఖ ఉద్యోగులు



జస్టిస్ సురేష్‌రెడ్డితో ఉద్యోగులు

చిత్తూరు అర్బన్: హైకోర్టు న్యాయమూర్తి, జిల్లా పోర్టుపోలియో జడ్జి జస్టిస్ సురేష్‌రెడ్డిని న్యాయశాఖ ఉద్యోగులు శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. చిత్తూరుకు వచ్చిన న్యాయమూర్తిని జిల్లా జడ్జి భీమారావుతో కలిసి ఓ హోటల్‌లో బేటీ అయ్యారు. ఉద్యోగుల సమస్యలపై చర్చించారు. కార్యక్రమంలో న్యాయశాఖ ఉద్యోగ సంఘ అధ్యక్షుడు గోపీనాథ్‌రెడ్డి, సభ్యులు లక్ష్మీపతి, బాలసుందరం, రవీంద్రారెడ్డి, రాజేష్, హరికృష్ణ, ప్రభాకర్‌రెడ్డి, సంతోష్, దిలీప్, యువరాజ్, రెడ్డెప్ప, చంద్రశేఖర్, భ్రమరాంబ, పవన కుమారి మినిమా పాల్గొన్నారు.

నేడు విద్యుత్ బిల్లుల చెల్లింపునకు అవకాశం

చిత్తూరు కార్పొరేషన్: కరెంటు బిల్లులను వినియోగదారులు ఆదివారం సైతం చెల్లించవచ్చని ట్రాన్స్‌కో చిత్తూరు, తిరుపతి జిల్లా ఎస్‌ఈలు ఇస్మాయిల్‌అహ్మద్, సురేంద్రనాయుడు తెలిపారు. శనివారం వారు మాట్లాడుతూ విద్యుత్ బిల్లుల చెల్లింపు కేంద్రాలు పని చేస్తాయని, వినియోగదారులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

పట్టా భూమి కబ్జా

- టీడీపీ నేతల అరాచకం



పట్టా స్థలంలో గుడిసె వేసిన టీడీపీ నాయకులు

వడమాలపేట (విజయపురం) : పట్టా భూమిని కబ్జా చేసి గుడిసెలు వేసిన సంఘటన వడమాలపేట మండలం, బాలనాయుడుకండ్రిగ పంచాయతీ ఎస్‌వీఆర్ కండ్రిగ ఆది ఆంధ్రవాడలో చోటు చేసుకొంది. వడమాలపేట మండలం ఎస్‌వీఆర్‌కండ్రిగ ఆది ఆంధ్రవాడ ఆనుకొని సర్వే నంబర్ 95–2ఎలో 0.73 సెంట్ల పట్టా భూమి ఉంది. దేవరాజులురెడ్డి భార్య వనజాక్షిపై రెవెన్యూ అధికారులు పట్టా ఇచ్చారు. సుమారు 10 దశాబ్దాల నుంచి భూ యజమానులు అందులో సాగు చేస్తున్నారు. రెవెన్యూ రికార్డుల్లో, వెబ్ ల్యాండ్‌లో ఇది పట్టా భూమిగా, యజమానుల పేర్ల మీద ఉంది. కానీ స్థానికంగా ఉన్న ముగ్గురు టీడీపీ నేతలు శనివారం పట్టా భూమిని కబ్జా చేసి తన అనుచరులతో గుడిసెలు వేయించారు. విషయం తెలుసుకొన్న భూ యజమాని అక్కడికి వెళ్లగా టీడీపీ నాయకులు అతడిపై దాడికి పాల్పడినట్లు రైతు ఆవేదన వ్యక్తం చేశారు. చేసేది ఏమి లేక తహశీల్దార్‌కు ఫిర్యాదు చేశారు.



రెవెన్యూ అధికారులు ఇచ్చిన పట్టా పాసు పుస్తకం

సిబిల్..గుబులే!

అడ్మిషన్ డిస్మిస్

- తిరుపతి కొర్లగుంటకు చెందిన ప్రకాష్‌రావు ఓ ప్రైవేటు కంపెనీలో మేనేజర్. కుటుంబ అవసరాల నిమిత్తం తొలిసారి ప్రైవేటు ఫైనాన్స్ కంపెనీ నుంచి ఈఎంఐ విధానంతో రూ.70వేలు లోన్ తీసుకున్నాడు. రెండు కంతుల చెల్లింపులో కాస్త ఆలస్యం అయ్యింది. ఫైన్‌తో పూర్తి ఈఎంఐలను చెల్లించాడు. తన కుమారుడు బీటెక్ పూర్తి చేసి కన్సల్టెన్సీ తరపున ఎంఎస్ చేసేందుకు ఆస్ట్రేలియలో సీటు సాధించాడు. అడ్మిషన్ ప్రక్రియలో భాగంగా విద్యార్థి తల్లిదండ్రుల ఆర్థికస్థితిగతులపై బ్యాంక్ స్టేట్‌మెంట్, సిబిల్ స్కోర్‌ను అధికారులు పరిశీలించారు. సిబిల్ స్కోర్ 480 ఉండడంతో ఎడ్యుకేషనల్ కన్సల్టెన్సీ విద్యార్థికి అడ్మిషన్‌ను నిరాకరించారు.

.. ఇది ఒక్క ప్రకాష్ పరిస్థితే కాదు. జిల్లాలో చాలామంది పరిస్థితి ఇదే విధంగా కొట్టుమిట్టాడుతోంది. సకాలంలో రుణాలు చెల్లించక.. అవసరాలకు రుణాలందక ఆర్థికంగా చితికిపోవాల్సి వస్తోంది. సిబిల్ స్కోర్ పరిగణనలోకి తీసుకోకుండా తప్పటడుగులు వేయాల్సి వస్తోంది.

పెళ్లి క్యాన్సిల్

- మహారాష్ట్రలోని మూర్తిజాపూర్ ప్రాంతానికి చెందిన ఓ యువకుడు ఐటీ ఉద్యోగి. ఐదు లోన్లు తీసుకుని బండి, ఇల్లు కొనుగోలు చేసి పెళ్లికి ప్రయత్నాలు చేశాడు. ఇంట్లో పెద్దలు ఓ సంబంధం చూసి ఓకే చేశారు. ఇంతలో పెళ్లి కుమార్తె తండ్రి పెళ్లికుమారుని బ్యాంక్ అకౌంట్, పాన్‌నంబర్ తీసుకుని సిబిల్ స్కోర్ చెక్ చేశాడు. సిబిల్ స్కోర్ 500 కన్నా తక్కువగా ఉండడంతో షాకయ్యాడు. ఆర్థిక భరోసా కల్పించలేరని గ్రహించి అమ్మాయిని ఇచ్చేదిలేదని తెగేసి చెప్పాడు. దీంతో పెళ్లి రద్దు చేసుకున్నారు.



సిబిల్ స్కోర్ ఎలా లెక్కిస్తారంటే!

- గత 36 నెలల రుణగ్రస్తుల క్రెడిట్ ప్రొఫైల్‌ను పరిగణనలోకి తీసుకుంటారు.
- రుణాలు, క్రెడిట్ కార్డులు, ఆటోమొబైల్స్, పర్సనల్, ఓవర్‌డ్రాఫ్ట్ చెల్లింపులను తీసుకుంటారు.
- పేమెంట్ హిస్టరీ 40శాతం ప్రధాన భూమిక పోషిస్తుంది.
- పరిమితికి మించి వాడుకుంటే క్రెడిట్ స్కోర్ తగ్గుతుంది. సిబిల్ స్కోర్ లెక్కింపులో 30 శాతం ప్రభావం చూపుతుంది.
- తక్కువ సమయంలో బహుళ రుణాలు తీసుకోవడం కారణంగా సిబిల్ స్కోర్‌పై ప్రతికూల ప్రభావం చూపుతుంది.
- హామీ రహిత రుణాలు ఎక్కువగా ఉంటే సిబిల్ స్కోర్ తగ్గే అవకాశం ఉంటుంది.

సిబిల్ స్కోర్ తెలుసుకోవడం ఇలా..

సిబిల్ అధికారిక వెబ్‌సైట్‌లోకి వెళ్లి పేరు, ఫోన్ నంబర్, ఈమెయిల్, పాన్ నంబర్ నమోదు చేయాలి. ఖాతా క్రియేట్ అయిన తర్వాత లాగిన్, పాస్‌వర్డ్ డీటైల్స్‌తో ఖాతాలోకి ప్రవేశించి రుణాలు, క్రెడిట్ కార్డుకు సంబంధించిన వివరాలు తెలపాలి. వెంటనే డ్యాష్‌బోర్డుపై సివిల్ స్కోర్ వివరాలు ప్రత్యక్షమవుతాయి. ఒకసారి మాత్రమే ఉచితంగా సిబిల్ స్కోర్ తెలుసుకోవచ్చు. అలాగే రూ.550 ఆన్‌లైన్ ద్వారా చెల్లించి సిబిల్ వెబ్‌సైట్‌లోకి వెళ్లి నోయువర్ స్కోర్‌ను క్లిక్ చేయాలి. ఐదు ప్రశ్నలకు సమాధానాలు ఇవ్వాలి. అనంతరం 24 గంటల్లో మీ సిబిల్ స్కోర్ వివరాలు ఈమెయిల్‌కు పంపుతారు.

సిబిల్ స్కోర్ తగ్గితే భవిష్యత్ గోవిందా!

- బ్యాంకు రుణాలు అందడం గగనమే
- సిబిల్ స్కోర్‌లో పురుషుల కంటే మహిళలే టాపర్స్
- జిల్లాలో 60శాతం మందిపై ప్రభావం

తిరుపతి సిటీ: ఆర్థిక అవసరాలు తీర్చుకునేందుకు, ఆకాంక్షలను సాకారం చేసుకునేందుకు క్రెడిట్ కార్డులు, రుణాలపై ప్రజలు ఆధార పడుతుంటారు. వీటిని పొందడంలో సిబిల్ స్కోర్ కీలక పాత్ర పోషిస్తోంది. రుణాలిచ్చేటప్పుడు బ్యాంకులు, ప్రైవేటు ఫైనాన్స్ సంస్థలు వ్యక్తి ఆర్థిక క్రమశిక్షణను పరిగణలోకి తీసుకుంటాయి. దీంతో చాలామంది మూడంకెల సంఖ్యను మెరుగుపరచుకోవడానికి ఆరాటపడుతుంటారు.

సిబిల్ స్కోర్ పెంచుకోండి ఇలా

- రుణాల చెల్లింపులు, ఈఎంఐలు, క్రెడిట్ కార్డుల చెల్లింపులు సకాలంలో చేయాలి
- పాత బ్యాంకు ఖాతాలు, క్రెడిట్ కార్డులను కొనసాగించాలి.
- క్రెడిట్ లిమిట్‌ను పూర్తిగా వాడేయొద్దు
- పదేపదే రుణాలకు దరఖాస్తు చేయొద్దు
- రుణాల చెల్లింపులో కంతులను సక్రమంగా చెల్లించాలి
- జాయింట్ అకౌంట్లతో రుణాలను తీసుకోకపోవడం మంచిది.
- అన్‌సెక్యూర్డ్ రుణాలను తక్కువ తీసుకోవాలి
- ఒకే వ్యక్తి స్థోమతకు మించి ష్యూరిటీ లేని రుణాలను తీసుకోవద్దు

సిబిల్ స్కోర్ ఆశాజనకంగా ఉంటే ప్రయోజనాలు ఇవే..

- అవసరమైన వెంటనే రుణాలు
- తక్కువ వడ్డీతో ఎక్కువ రుణం
- ష్యూరిటీలతో పని ఉండదు
- ఎక్కువ కాలపరిమితి గల రుణాలు
- గృహ, వాహన, వ్యక్తిగత రుణాలు పొందడానికి హామీలతో పనిలేదు
- క్యాష్ బ్యాక్ సౌకర్యం, ఎంపిక చేసిన కొనుగోళ్లపై రివార్డులు
- ప్రీ అప్రూవ్డ్ రుణాల పేరుతో బ్యాంకులు, ప్రైవేటు సంస్థలు స్వయంగా రుణాలను ఆఫర్ చేస్తాయి.
- సాధారణ బీమా పాలసీలకు ప్రీమియం తగ్గింపు
- ఫైనాన్స్ సంస్థలు, బ్యాంకుల నుంచి ప్రీమియం క్రెడిట్ కార్డులు పొందే అవకాశం

సిబిల్ స్కోర్ అంటే...

సిబిల్ స్కోర్ అంటే వ్యక్తి, సంస్థ, కంపెనీల క్రెడిట్ చరిత్రను గణనచేసేందుకు 2017లో రిజర్వు బ్యాంక్ అనుమతి పొందిన సంస్థ. క్రెడిట్ చరిత్రను తెలుసుకోవడానికి దేశంలో నాలుగు సంస్థలు ఉన్నాయి. అందులో ప్రధాన మైంది క్రెడిట్ ఇన్ఫర్మేషన్ బ్యూరో ఇండియా లిమిటెడ్ (సీబీఐఎల్). దీనినే సిబిల్‌గా పిలుస్తుంటారు.



సిబిల్ స్కోర్ ఎంత ఉండాలంటే...

సాధారణంగా సిబిల్ స్కోర్ 300 నుంచి 900 మధ్య ఉంటుంది. 550 కంటే తక్కువ ఉంటే రుణాల మంజూరుకు బ్యాంకులు అనుమతించవు. 750నుంచి 900 అత్యుత్తమ స్కోర్, 650 నుంచి 750 ఉంటే మంచి స్కోర్, 550 నుంచి 650 యావరేజ్, 300 నుంచి 550 ఉంటే డేంజర్ స్కోర్.

సిబిల్ స్కోర్ తగ్గడానికి కారణాలు

ఆదాయానికి మించి రుణాలు పొందడం, రుణాల చెల్లింపులలో అలసత్వం, ప్రభుత్వ ఉద్యోగులకు నెల మొదటి వారంలో సక్రమంగా వేతనాలు అందకపోవడం, రుణగ్రస్తులైన వ్యాపారుల ఆర్థికలావాదేవీలలో ఆలస్యం, ఆకస్మిక ఉద్యోగాల తొలగింపు, గ్రామీణ రైతుకు గిట్టుబాటు ధర అందకపోవడం వంటివి సిబిల్ స్కోర్ తగ్గడానికి ప్రధాన కారణాలు.

సిబిల్ స్కోర్ టాపర్స్ మహిళలే

జిల్లాలో రుణాలు తీసుకుంటున్న మహిళల సంఖ్య పెరుగుతోంది. పురుషుల కంటే స్త్రీలు తమ కంతుల చెల్లింపులలో అగ్రస్థానంలో ఉంటూ సిబిల్ స్కోర్‌ను కాపాడుకుంటున్నారు. జిల్లాలో సుమారు 91శాతం మంది మహిళలు 800ప్లస్ స్కోర్‌లో ఉన్నారంటే అతిశయోక్తికాదు.

సిబిల్ స్కోర్‌తో అప్రమత్తంగా ఉండాలి



"రుణగ్రస్తులు సిబిల్ స్కోర్ పట్ల నిర్లక్ష్యం వహించొద్దు. జిల్లాలో సుమారు 60శాతం మంది రుణగ్రస్తులకు 550లోపు స్కోర్ ఉంది. సక్రమంగా రుణాల చెల్లించకపోవడం ఇందుకు ప్రధాన కారణంగా చెప్పవచ్చు. – నరసింహస్వామి, పేరొందిన ప్రభుత్వ బ్యాంక్ రిటైర్డ్ మేనేజర్, తిరుపతి

భవిష్యత్తుపై ప్రభావం



ప్రైవేటు, ప్రభుత్వ ఫైనాన్స్ సంస్థలు, బ్యాంకులు రుణగ్రస్తుల అవసరాలకు రుణాలను మంజూరు చేస్తాయి. వాటిని గడువు లోపు చెల్లిస్తే ఇబ్బంది ఉండదు. లేనిపక్షంలో రుణగ్రస్తుని ఆర్థిక స్థితికి మించి అపరాధం కట్టుకోవాల్సి ఉంటుంది. – రవిచంద్రారెడ్డి, ప్రముఖ ఫైనాన్స్ కంపెనీ, సేల్స్ మేనేజర్, తిరుపతి

రోడ్డు ప్రమాదంలో చెల్లెలు మృతి

- అన్నకు తీవ్ర గాయాలు
- రోడ్డుదాటుతుండగా ఢీకొట్టిన కారు



నోమేశ్వరి మృతదేహం



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న మహేష్

నగరి : అన్నా చెల్లెళ్లను విధి శాశ్వతంగా విడదీసింది. ముక్కు పచ్చలారని చిన్నారిని రోడ్డు ప్రమాదం చిదిమేసింది. కూలి పనులతో పొట్ట నింపుకొని ఉన్నదాంతో సంతృప్తి పడుతూ ఆనందంగా గడిపే ఆ కుటుంబంలో రోడ్డు ప్రమాదం తీరని విషాదం నింపింది. శనివారం వీకేఆర్ పురం గ్రామం వద్ద జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదం ఈ విషాదానికి కారణమైంది. ఈ రోడ్డు ప్రమాదంలో జి.నోమేశ్వరి (10) మృతి చెందగా, సోదరుడు జి.మహేష్ (14) తీవ్ర గాయాలపాలయ్యాడు. సీఐ విక్రమ్ తెలిపిన వివరాల మేరకు వీకేఆర్ పురం జగనన్న కాలనీలో ఉంటున్న కూలీలు గోపి, బుజ్జి దంపతుల కుమారుడు జి.మహేష్ తడుకుపేట జడ్పీ హైస్కూల్‌లో 9వ తరగతి చదువుతున్నాడు. కుమార్తె నోమేశ్వరి.. ఎంఎస్ కండ్రిగ ప్రాథమిక పాఠశాలలో 5వ తరగతి చదువుతోంది. ప్రస్తుతం ఒంటిపూట బడులు కావడంతో మధ్యాహ్నమే బడి అయిపోయింది. అయితే తడుకుపేట పాఠశాలలో పదో తరగతి పరీక్షలు జరుగుతుండటంతో మధ్యాహ్నం నుంచి ఒంటిపూట బడి జరుగుతుంది. దీంతో అన్న వచ్చే వరకు ఎంఎస్ కండ్రిగలో బంధువుల ఇంటి వద్ద నోమేశ్వరి వేచి ఉంటుంది. ఇద్దరూ కలిసి సాయంత్రం ఇంటికి చేరుకుంటారు. ఈ క్రమంలో శనివారం 4 గంటలకు ఇంటికి వెళ్లడానికి ఇరువురు రోడ్డు దాటుతుండగా చెన్నై వైపుగా వెళ్లే కారు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో నోమేశ్వరి అక్కడికక్కడే మృతి చెందగా, మహేష్ గాయాలపాలయ్యాడు. స్థానికుల సమాచారం మేరకు వారిని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేశారు. కాగా పిల్లల పెద్ద సోదరుడు భూపతి ఐటీఐ చదువుతున్నాడు.

పిల్లల ప్రవర్తనపై నిఘా ఉంచండి

- యువతను డ్రగ్స్ నుంచి కాపాడుకుందాం
- జూనియర్, డిగ్రీ, ఇంజినీరింగ్ కళాశాలల్లో యాంటీ డ్రగ్స్ కమిటీలు ఏర్పాటు
- సమావేశంలో కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ

చిత్తూరు కలెక్టరేట్ : తల్లిదండ్రులు పిల్లల ప్రవర్తనలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ అన్నారు. శనివారం కలెక్టరేట్‌లో నార్కోటిక్ కమిటీ సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ.. యువత డ్రగ్స్ బారిన పడకుండా సంబంధిత శాఖలు సమన్వయంతో సమర్థవంతంగా పనిచేయాలన్నారు.

యాంటీ ర్యాగింగ్ కమిటీలు ఏర్పాటు చేయండి

జిల్లాలోని విద్యాసంస్థల్లో యాంటీ ర్యాగింగ్ కమిటీలను ఏర్పాటు చేయాలని కలెక్టర్ ఆదేశించారు. మండల స్థాయిలో ఎంఈవో, పోలీస్‌ల సమన్వయంతో ప్రణాళికను సిద్ధం చేసుకోవాలన్నారు.

విస్తృత తనిఖీలు చేపట్టండి

చిత్తూరు జిల్లా తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాలకు సరిహద్దులో ఉండటంతో విస్తృత తనిఖీలు నిర్వహించాలని కలెక్టర్ ఆదేశించారు.

టోల్ ఫ్రీ నంబర్‌కు సమాచారం ఇవ్వండి : ఎస్పీ

జిల్లాలో డ్రగ్స్ వినియోగించడం, సరఫరా, అమ్మకాలు ఎక్కడైనా ఉన్నట్లైతే టోల్ ఫ్రీ నంబర్ 1972కు సమాచారం ఇవ్వాలని ఎస్పీ మణికంఠ చందోలు అన్నారు. జిల్లాలో డ్రగ్స్ నియంత్రణకు పోలీస్ శాఖకు ప్రజలు సహకారం అవసరమన్నారు. చిన్నపిల్లలకు చాక్లెట్స్ రూపంలో మత్తుకు బానిసలు చేసే అవకాశం ఉందన్నారు. జిల్లాలో డ్రగ్స్ నియంత్రణకు రానున్న 45 రోజుల్లో జిల్లా యంత్రాంగంతో పోలీస్ శాఖ సంయుక్తంగా కార్యచరణ ప్రణాళికను సిద్ధం చేసుకుని ముందుకు వెళ్తామన్నారు.

డాక్టర్ల ప్రిస్క్రిప్షన్‌లు లేనిదే మందులు ఇవ్వొద్దు

మందుల షాపుల్లో డాక్టర్ల ప్రిస్క్రిప్షన్‌లు లేనిదే మందులు ఇవ్వకూడదని ఎస్పీ తెలిపారు. ఈ విషయంలో సంబంధిత శాఖలు తనిఖీలు నిర్వహించాలన్నారు. జిల్లా వ్యాప్తంగా ఈనెల 21 న మందుల షాపుల్లో విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు దాడులు నిర్వహించినట్లు తెలిపారు. సమావేశంలో డీఎంఅండ్‌హెచ్‌వో డాక్టర్ సుధారాణి, సమగ్రశిక్ష ఏపీసీ వెంకటరమణ, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి మురళీకృష్ణ, ఎక్సైజ్ అధికారి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

1.5 కోట్ల ఫ్రూట్ కవర్ల విక్రయం



మధుసూదన్‌రెడ్డి, జిల్లా ఉద్యానశాఖాధికారి

చిత్తూరు రూరల్ (కాణిపాకం): జిల్లావ్యాప్తంగా ఇప్పటి వరకు 1.5 కోట్ల మ్యాంగో ఫ్రూట్ కవర్లు విక్రయించినట్లు జిల్లా ఉద్యాన శాఖ అధికారి మధుసూదన్‌రెడ్డి తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ మామిడి రైతులకు ప్రభుత్వం రాయితీతో మ్యాంగో ఫ్రూట్ కవర్లు అందిస్తోందన్నారు. జిల్లాకు 1.90 కోట్ల కవర్లు విక్రయించాలని లక్ష్యం నిర్దేశించగా, అందులో 40 లక్షల కవర్లు మిగిలున్నాయని వెల్లడించారు. మరో రెండు రోజుల్లో ఇవి కూడా అమ్ముడుబోయే అవకాశముందని చెప్పారు. కవర్లు కావాల్సిన రైతులు పట్టాదారు పాసుపుస్తకం, ఆధార్ కార్డు జిరాక్స్ అందించి కవర్లు పొందవచ్చునని సూచించారు. టేబుల్ రకం మామిడి పండించే రైతులకు ఈ కవర్లు ఎంతో ఉపయోగపడతాయన్నారు. కవర్లు కట్టిన పంట దిగుబడి నాణ్యతగా ఉంటుందని, చీడపురుగుల ఆశించవని వివరించారు. కవర్లు అమర్చిన మామిడి పంటకు మంచి డిమాండ్ ఉంటుందని, మార్కెటింగ్ సులభతరమని స్పష్టం చేశారు.